మన చౌరాస్తా





### జనగామ ఏసీపీ కార్యాలయంలో

# వరంగల్ సీపీ తనిఖీలు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పోలీస్ డివిజనల్ కార్యాలయాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తనిఖీ చేశారు. సోమవారం ఏసీపీ కార్యాలయమునకు చేరుకున్న సీపీకి వెస్ట్ జోన్ డీసీపీ రాజా మహేంద్ర నాయక్ , డివిజనల్ పోలీస్ అధికారులు మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ డివిజనల్ కార్యాలయమునకు సంబంధించిన రికార్డులను సీపీ పరిశీలించారు. ఏసీపీ దర్యాప్తు అధికారిగా వున్న పెండింగ్ కేసుల వివరాలు, నేరస్తుల అరెస్ట్, కేసుల దర్యాప్తు స్థితి గతులపై పోలీస్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అధికారుల పనితీరుపై సమీక్షా జరిపారు. చివరగా పోలీస్ కమిషనర్ డివిజినల్ పోలీస్ అధికారులతో మాట్లాడుతూ పోలీస్ ప్రతిష్టకు భంగం కలిగించే రీతిలో అధికారులు వ్యవహరిస్తే సహించేది లేదని, ప్రజలు పోలీసులపై పెట్టిన నమ్మకానికి తగ్గట్లుగా పనిచేయాలని. ముఖ్యంగా డయల్ 100 నుండి వచ్చే ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు తక్షణమే స్పందించి త్వరితగతిన బాధితులకు సహాయం అందించాలినని, పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఏసీపీ కార్యాలయం ఆవరణలో పోలీస్ కమిషనర్ మొక్కలను నాటారు.

### పిల్లల ఆరోగ్యం పట్ల

# శ్రద్ధ వహించాలి

- వరంగల్ ఎంపీ కావ్య

**హనుమకొండ, మన చౌరాస్తా:** విద్యార్థినులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు ఆరోగ్య కార్డుల పంపిణీ, ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థినులను ఉద్దేశించి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థినికి చదువుతోపాటు ఆరోగ్యం, వ్యక్తిగత శ్రద్ధ ఎంతో అవసరమని అన్నారు. ప్రతి విద్యార్థిని ఆరోగ్యం కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పౌష్టిక ఆహారాన్ని భోజనంలో ఉండే విధంగా విద్యార్థినులు చూసుకోవాలన్నారు. జంక్ ఫుడ్ కు దూరంగా ఉండాలని , సహజ సిద్ధమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. రక్తహీనత, థైరాయిడ్, తదితర ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలన్నారు. విద్యార్థినులకు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కరోనా అనంతర పరిస్థితులలో శారీరక, మానసిక పరిస్థితులలో మార్పులు వస్తున్నాయని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు విద్యార్థుల ప్రవర్తన మార్పులను గమనించి తదనుగుణంగా వైద్య సహాయాన్ని అందించాలన్నారు. ఈ సందర్భంగా 9 కేజీబీవీలు, మూడు మోడల్ స్కూల్స్, ఒక అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు 4000 హెల్త్ కార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. హెల్త్ కార్డులను ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ ప్రావీణ్య, చేతుల మీదుగా విద్యార్థినులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ వాసంతి, డిఎంహెచ్వో డాక్టర్ లలితా దేవి, తహసీల్దార్ విక్రమ్, ఇతర అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



